నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నాం

అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్

అంబర్‌పేట: నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి నిరంతరయంగా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. అంబర్‌పేట డివిజన్ ప్రేమ్‌నగర్‌లో రూ.15లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు, నాలా కనెక్టింగ్ రోడ్ల పనులను బుధవారం కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇప్పటికే నియోజకవర్గంలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు పెద్ద ఎత్తున అభివృద్ధి పనులను చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ, పైపులైన్ వ్యవస్థ, పార్కులు, వంటి పనులను ప్రజల అవసరాలకు అనుగుణంగా చేపట్టినట్లు చెప్పారు. అలాగే నిత్యం తలెత్తే మౌలిక సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారించే దిశగా చొరవ తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం ప్రజా సమస్యలపై కార్పొరేటర్‌తో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులతో పాటు స్థానిక బీఆర్ఎస్ నాయకులు సిద్ధార్థ ముదిరాజ్, లింగరావు, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

తాండ్రకుమార్ వర్ధంతి సభలను జయప్రదం చేయాలి



తాండ్రకుమార్ వర్ధంతి సభ పోస్టర్, కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న వనం సుధాకర్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఎంసీపీఐ(యూ) పొలిట్ బ్యూరోసభ్యుడు రాష్ట్ర కార్యదర్శి తాండ్ర కుమార్ వర్ధంతి సభలను రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 14 నుంచి 21 వరకు నిర్వహించనున్నామని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వనం సుధాకర్ తెలిపారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో వర్ధంతి సభలకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వనం సుధాకర్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న సమయంలో తాండ్రకుమార్ అనారోగ్యంతో మృతిచెందారని ఆయన అనేక సంవత్సరాలు బడుగు బలహీనవర్గాల సంక్షేమం కోసం ఎంతగానో కృషి చేశారని తెలిపారు. అలాంటి మహనీయుడి వర్ధంతి సభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

- ఈనెల 14న గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మియాపూర్ క్రాస్‌రోడ్ వద్ద ఉన్న తాండ్రకుమార్ భారీ స్థూపం నుంచి టీకు నర్సింహానగర్ వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం తాండ్ర కుమార్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తామని పేర్కొన్నారు. ఈ విగ్రహ ఆవిష్కరణలో ఎంసీపీఐ(యూ) అఖిల భారత ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్, ఓంకార్, బీఎల్ఎఫ్ చైర్మన్ నల్లా సూర్యప్రకాష్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. పాలక వర్గాల తప్పుడు విధానాలపై తాండ్రకుమార్ చేసిన రాజీలేని పోరాటాన్ని గుర్తు చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వి.తుకారం నాయక్, రాయబండి పాండురంగాచారి, పి.యాదగిరి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం

ఫిబ్రవరి 20న చలో హైదరాబాద్



చలో హైదరాబాద్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న న్యూడెమాక్రసీ నేతలు

ముషీరాబాద్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని ఫిబ్రవరి 20న చలో హైదరాబాద్‌కు పిలుపునిస్తున్నట్లు సీపీఎంఐఎల్ న్యూ డెమాక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధులు జేవీ చలపతిరావు, సాధినేని వెంకటేశ్వర్ రావు తెలిపారు. విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో బుధవారం చలో హైదరాబాద్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం కోసం ఆరు గ్యారంటీల మాటున 420 హామీలను ఇచ్చిందని విమర్శించారు. 7వ గ్యారంటీగా ప్రజాహక్కులను కాపాడుతామని ప్రజాస్వామికపాలన అందిస్తామని హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చి 400రోజులు గడిచినా నేటికి ఆ వాగ్దానాలను అమలు చేయడంలో నిర్లక్ష్యంగా ఉంటోందన్నారు. ఫిబ్రవరి 20న సుందరయ్య పార్కు నుంచి ఇందిరాపార్కు వరకు భారీ ర్యాలీ ఉంటుందన్నారు. ధర్నా చౌక్‌లో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు కె.గోవర్ధన్, జి.ఝాన్సీ, అరుణ, అనురాధా, పి.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

గానగోష్ఠి



ప్రముఖ శాస్త్రీయ సంగీత గురువు మల్లాది ఉష తమ శిష్య బృందంతో త్యాగరాయ గానసభలోని బుధవారం గానగోష్ఠి నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నమయ్య కీర్తనలు, రామదాసు కృతులను లయబద్ధంగా ఆలపించి శ్రోతలను ముగ్ధులను చేశారు. ఈ సందర్భంగా గానసభ అధ్యక్షుడు కళా జనార్దనామూర్తి కళాకారులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ సేవకుడు వంగాల బాలరాజుగౌడ్, గాయకురాలు గరిమెళ్లసీత తదితరులు పాల్గొన్నారు. –చిక్కడపల్లి

మాదిగ అమరవీరుల కుటుంబాలను ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ

ముషీరాబాద్: మాదిగ అమరవీరుల కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు, ఇంటికో ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని తెలంగాణ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ డిమాండ్ చేశారు. బుధవారం విద్యానగర్‌లోని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణను అసెంబ్లీ సాక్షిగా ఆమోదించి మాదిగల చిరకాల స్వప్నమైన ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. తెలంగాణ ఉద్యమం ఎంత న్యాయమైందో ఎస్సీ వర్గీకరణ ఉద్యమం కూడా అంతే న్యాయమైందని అన్నారు. వర్గీకరణ ఉద్యమంలో అసువులు బాసిన అమరవీరుల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో పి.రమేష్, కొల్లూరి వెంకట్, చందు, జీవన్, నాగరాజు, సురేష్, శ్రీకాంత్, ఫణీంద్ర, శ్రీను, మారుతి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



నల్లకుంట శంకరమఠం వద్ద రోడ్డు పక్కనే వాహనాల పార్కింగ్



ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా సమీపంలో ఏకంగా ఫుట్‌పాత్‌పైనే కారు పార్కింగ్

నో పార్కింగ్ అని తెలిసినా...

రోడ్లు, ఫుట్‌పాత్‌లపై వాహనాల నిలిపివేత

- జటిలమవుతున్న ట్రాఫిక్ సమస్య
- పట్టించుకోని జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు

నల్లకుంట: అంబర్‌పేట నియోజకవర్గంలో రోడ్లు, ఫుత్‌పాత్‌లు పార్కింగ్ స్థలాలుగా మారుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా పార్కింగ్ స్థలం లేకుండా వెలుస్తున్న వాణిజ్య సముదాయాలు, దుకాణాలతో ఈ సమస్య మరింత జఠలంగా మారుతోంది. జీహెచ్ఎంసీలోని టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు, ట్రాఫిక్ పోలీసులు చూసీచూడనట్టు వదిలేస్తుండంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి.

పార్కింగ్ స్థలాలు ఎక్కడ..?

అంబర్‌పేట నియోజకవర్గంలోని అన్ని డివిజన్లు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. ఈ క్రమంలో ప్రధాన రహదారుల వెంట ఇబ్బడి ముబ్బడిగా వాణిజ్య సముదాయాలు, దుకాణాలు, విద్యాసంస్థలు, ప్రైవేటు ఆస్పత్రులు వెలుస్తున్నాయి. వీటికి ఎక్కడా కూడా పార్కింగ్ స్థలాలు లేకున్నప్పటికీ జీహెచ్ఎంసీ సర్కిల్–16 టౌన్‌ప్లానింగ్ అధికారులు అనాలోచితంగా అనుమతులు ఇస్తున్నారని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.


- ప్రధానంగా నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా నుంచి శంకరమఠం వెళ్లే ప్రధాన రహదారి, ఫీవర్ చౌరస్తా నుంచి తిలక్‌నగర్ చౌరస్తా వెళ్లే రహదారి, శివం రోడ్డులో రోడ్డు కిరువైపులా వాణిజ్య సమాదాయాలు, దుకాణాలు, ప్రైవేటు ఆస్పత్రులు, విద్యా సంస్థలు ఉన్నాయి. వీటిలో 80 శాతం భవనాలకు పార్కింగ్ స్థలాలు లేవు. అయినా భవన ని ర్మాణాలకు టౌన్ ప్లానింగ్ విభాగం నుంచి అనుమతులు ఎలా ఇస్తున్నారో అధికారులకే తెలియాలి.
- వాటికి పార్కింగ్ స్థలాలు లేకపోవడం కారణంగా వాణిజ్య సముదాయాలు, దుకాణాలకు వచ్చే వారు తమ వాహనాలను ఇష్టారాజ్యంగా రోడ్ల పక్కన పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. దీనికి తోడు ఫుట్ పాత్‌లపై వాహనాలు నిలుపుతుండటంతో పాదచారులకు నడిచేందుకు దారిలేక రోడ్లపై నడిచి వెళ్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు.

వీధుల్లోనే గృహ నిర్మాణ సామగ్రి..

అంతర్గత వీధుల్లో గృహ నిర్మాణాలు చేపట్టే వారు నిర్మాణ సామగ్రిని ఇష్టారాజ్యంగా రోడ్లకు ఇరువైపులా కుప్పలుగా పోస్తూ వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగిస్తున్నారు. వీధుల్లో నిర్మాణ సామగ్రిని వేయకుండా చూడాల్సిన టౌన్‌ప్లానింగ్ అధికారులు ఆయా ఇళ్ల యజమానుల నుంచి ముడుపులు పుచ్చుకుంటూ ఇదంతా తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని సర్వత్రా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు, వీధుల్లో గృహ నిర్మాణ సామగ్రి వేయడంపై వివరణ కోసం టౌన్ ప్లానింగ్ అధికారులకు మీడియా ప్రతినిధులు ఫోన్ చేస్తే స్పందన ఉండడం లేదు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు స్పందించి రోడ్లు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వాహనాలు నిలుపకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



రైల్లో గుర్తుతెలియని వ్యక్తి మృతి



కాచిగూడ: రైల్లో ప్రయాణిస్తున్న ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... రాయచూర్ నుంచి కాచిగూడకు వస్తున్న డెమో రైల్లో ఓ గుర్తుతెలియని వృద్ధుడు (70) సహజ మరణం పొందారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంకన్ డ్రైవ్‌లో ఐదుగురికి జైలు

కాచిగూడ: మద్యం సేవించి వాహనాలు నడుపుతూ డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఐదుగురికి నాంపల్లి కోర్టు జైలు శిక్ష విధించిందని కాచిగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అనుమల శ్రీనివాస్ తెలిపారు. వీరిలో నలుగురికి రెండు రోజుల జైలు శిక్ష విధించిందన్నారు. నాల్గోసారి మద్యం సేవించి పట్టుబడిన ఓ వ్యక్తికి 22 రోజుల జైలు శిక్షను కోర్టు విధించిందని ఆయన తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని ఆయన వాహనదారులకు విజ్ఞప్తి చేశారు.

గుండెపోటుతో మాస్‌లైన్ నేత ధ్రువ నారాయణ మృతి



ముషీరాబాద్: సీపీఐఎంఎల్ మా స్లైన్ కేంద్ర కమిటీ సభ్యులు ధ్రు వ నారాయణ గుండెపోటుతో బు ,దవారం మృతి చెందారు. నారా యణ విప్లవోద్యమంలో కీలకపా త్ర పోషించారు. ఎన్నో పోరాటాల అనుభవం కలిగిన ధ్రువ నారాయణ అకాల మరణం పట్ల మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు విప్లవ జోహార్లు అర్పించారు. ఆయన ఆశయాల సాధనకు మాస్‌లైన్ కృషి చేస్తుందని తెలిపారు.

గంజాయి పట్టివేత

వెంగళరావునగర్ : గంజాయి వినియోగిస్తున్న ఓ యువకుడిని మధురానగర్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం రహమత్‌నగర్ బంగారుమైసమ్మ దేవాలయం ప్రాంతంలో కొందరు వ్యక్తులు గంజాయి తాగుతున్నట్టుగా పోలీసులకు సమాచారం అందింది. బుధవారం పోలీసులు అక్కడికి చేరుకోగా కార్తీక్ అనే యువకుడు వారిని చూసి పారిపోయేందుకు ప్రయత్నించాడు. దీంతో అతడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు అతడి నుంచి 2 ఓబీసీ రోల్స్, గ్రాము గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రంగరాజన్‌పై దాడి అమానుషం

డా. చిక్కా దేవదాస్



సుందరయ్యవిజ్ఞానకేంద్రం: చిలుకూరి బాలాజీ దేవాలయం ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడిచేయడం అమానుషం, బాధాకరమని చేనేత వర్గాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు రాజయోగి డా. చిక్కా దేవదాస్ అన్నారు. బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చిక్కా దేవదాస్ మాట్లాడుతూ... ఆధ్యాత్మికత భావనను పెంపొందించేందుకు కృషి చేస్తున్న రంగరాజన్ లాంటి వ్యక్తులు మతచాందస వాదులు దాడి చేయడం బాధాకరం అన్నారు. ఆధ్యాత్మికతతో పాటు సమాజానికి ఉపయోగపడేలా మార్గాలను చూపాలని అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న రంగరాజన్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. చేనేత వస్త్రాలను ధరించి చేనేత కార్మికులకు అండగా నిలవాలన్న గొప్ప వ్యక్తి రంగరాజన్ సూచించారని అన్నారు. దళితుడు, బ్రాహ్మణుడు సమానమేనని భావించి దళితుడిని రంగరాజన్ తన భుజాలపై మోసి దళితులకు ఆలయ దర్శనం చేయించిన గొప్ప మానవతా వాది రంగరాజన్ అని అలాంటి వ్యక్తిపై ఇలాంటి సంఘటనలు పుణరావృత్తం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సేవాలాల్ జయంతికి అధికారిక సెలవు ప్రకటించాలి

మంత్రి సీతక్కకు విజ్ఞప్తి



మంత్రి సీతక్కను కలిసి విజ్ఞప్తి చేస్తున్న డాక్టర్ రాజ్‌కుమార్ జాదవ్

కాచిగూడ: బంజారా (లంబాడీల) ఆరాధ్య దైవం సంత్ శ్రీసేవాలాల్ మహారాజ్ జయంతి (ఈనెల 15) సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అధికారిక సెలవు ప్రకటించాలని బంజారా ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌కుమార్ జాదవ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను కలిసి ఆయన వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఇందుకు సానుకూలంగా స్పందించిన మంత్రి సీతక్క సంత్ సేవాలాల్ జయంతి సెలవు విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. జయంతికి సెలవు వచ్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బోడ భద్రునాయక్, గుగులోత్ రమేష్‌యాదవ్, రాందాస్ నాయక్, గుగులోత్ ప్రవీణ్‌నాయక్, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పార్కుల సుందరీకరణకు అన్ని చర్యలు చేపట్టాలి



పీపుల్స్ పార్కులో ఉద్యానవన అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి: పార్కులను సుందరంగా తీర్చిదిద్దేందుకు అధికారులు అన్ని చర్యలు చేపట్టాలని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ పావని ఆదేశించారు. బుధవారం పీపుల్స్‌పార్క్, చిక్కడపల్లిలోని జనతాపార్క్, అష్టలక్ష్మి దేవాలయం పార్కులను ఆమె ఉద్యానవన అధికారులు, స్ట్రీట్‌లైట్స్, ఇంజినీరింగ్ అధికారులతో కలసి ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. పార్కుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అవసరం ఉన్న చోట కొత్త వీధి దీపాలను ఏర్పాటు చేయాలని సూచించారు. పీపుల్స్ పార్కులో వాటర్ ఫౌంటేన్, కూర్చునేందుకు బెంచీలు, పిల్లలు ఆడుకునేందుకు ఆట పరికరాలను ఏర్పాటు చేయాలన్నారు. అమర్చాలని సూచించారు. ఏ పార్కులో చెత్తాచెదారం కనిపించొద్దన్నారు. ప్రతిరోజు చెత్తను తొలగించాలని జీహెచ్ఎంసీ సిబ్బందిని ఆదేశించారు. హార్టికల్చర్ డీఈ ఆశిష్, ఏఈ సంజయ్, స్ట్రీట్ లైట్స్ సూపర్‌వైజర్స్ బాలు నాయక్, రాజు, సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు నవీన్‌కుమార్, స్థానికులు గంగారాజు, విద్యాసాగర్, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను కలిసిన కోలేటి దామోదర్‌గుప్తా



చిక్కడపల్లి: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును బుధవారం ఎర్రవెల్లి ఫామ్ హౌస్‌లో తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో జరుగుతున్న కాంగ్రెస్ పాలన, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు.

సంగీత కళాకారులకు సన్మానం



సంగీత కళాకారులను సన్మానించిన మహాసంఘం కార్యదర్శి తిరుమలరావు

నల్లకుంట: అఖిల భారత శ్రీరామనామ మహాసంఘం వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం పలువురు సంగీత కళాకారులను సన్మానించారు. ఈ సందర్భంగా సరస్వతి సంగీత విద్యాలయం ప్రిన్సిపాల్, పంచశత వీణాగాన రత్న పోపూరి శ్రీనివాసశర్మను మహా సంఘం ప్రతినిధులు శాలువాతో సన్మానించి సత్కరించారు. అలాగే ప్రముఖ మృదంగ కళాకారుడు దుర్గా కుమార్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహాసంఘం అధ్యక్షుడు ఆర్ఎస్.రంగదాసు, కోశాధికారి తిరుమలరావు, కోశాధికారి పి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

18న జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముట్టడి

కాచిగూడ: కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర చైర్మన్ నీల వెంకటేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు పార్టీ పరంగా 42శాతం కోటా ఇస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారని, పార్టీ పరంగా 42శాతం ఇస్తే బీసీలకు న్యాయం జరగదన్నారు. ఎలాంటి వివాదాలకు తావులేకుండా అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ చట్టం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఈనెల 18న రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్లు, ఆర్డీఓ, మండల తహసీల్దార్ కార్యాలయాలను ముట్టడించనున్నట్లు తెలిపారు. బీసీలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రామకృష్ణ, నందగోపాల్, మోదీరాందేవ్, శివ, మట్ట జయంతి గౌడ్, కీర్తిలత, రవియాదవ్, శివకుమార్, ఉదయ్, బాలస్వామి పాల్గొన్నారు.

భూ నిర్వాసితులను ఆదుకోవాలి

కవాడిగూడ: గత ప్రభుత్వం ప్రాజెక్టులు, పరిశ్రమల పేరుతో 2018 సంవత్సరంలో రంగారెడ్డి జిల్లా పరిధిలోని అనేక ప్రాంతాలలో రైతుల వద్ద నుంచి బలవంతంగా భూములు సేకరించి అన్యాయం చేశారని భూ నిర్వాసితుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు నీరటి ఆంజనేయులు ఆరోపించారు. బలవంతంగా లాక్కున్న భూ నిర్వాసితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో తెలంగాణ సోషలిస్ట్ పార్టీ (ఇండియా), భూ నిర్వాసితుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో నిరసన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా హాజరైన ఆంజనేయులు మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో జరిగిన భూ దందాలపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. షాబాద్, చందన్‌వెల్లి, ఐతాబాద్, మాచన్‌పల్లి, సీతారాంపూర్ తదితర గ్రామాలలోని సుమారు 500 మంది రైతుల నుంచి 3200 ఎకరాల భూములను బలవంతంగా లాక్కుందని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి స్పందించి రైతులు కోల్పోయిన భూములకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సోషలిస్ట్ పార్టీ (ఇండియా) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు రచ్చ సుభద్రా రెడ్డి, కన్వీనర్ కె.రెడ్డయ్య, కిసాన్ సభ నాయకులు లక్ష్మణ్, ఉపాధ్యక్షులు రమేష్ నాయుడు, భూనిర్వాసితుల సంఘం ఉపాధ్యక్షుడు సుప్పల నర్సింహులు, సహాయ కార్యదర్శులు దయాకర్, నర్సింహులు, ఎండీ యూసుఫ్, బాలయ్య, కృష్ణయ్య గౌడ్‌తోపాటు భూములు కోల్పోయిన రైతులు పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న నీరటి ఆంజనేయులు

366 కలశాలతో మహా కుంభాభిషేకం



కట్టమైసమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

కవాడిగూడ: లోయర్ ట్యాంక్‌బండ్‌లోని కనకాల కట్టమైసమ్మ దేవాలయంలో బుధవాంర మహా కుంభాభిషేక 35వ వార్షికోత్సవం జరిగింది. బుధవారం తెల్లవారు జాము నుంచే అమ్మవారికి పంచామృత అభిషేకాలు, విశేష కుంకుమార్చనలు నిర్వహించారు. చండీహోమం నిర్వహించి అమ్మవారికి మహా పూర్ణాహుతితో ప్రత్యేక పూజలు చేశారు. భక్తిశ్రద్ధలతో 366 కలశాలతో మహా కుంభాభిషేకం, చండీహోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు. ఈ పూజలో ఆలయ చైర్మన్ గోల్కొండ గౌతం కుమార్‌పటేల్, ఆయన సతీమణి లత, ఆలయ ఈవో సాంబశివరావు, ప్రధాన అర్చకులు సాత్విక్ శర్మ, అర్చకులు రాజీవ్ శర్మ, రాంబాబు శర్మ, ఆలయ సీనియర్ అసిస్టెంట్ సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం



వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకొని బుధవారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. అదే విధంగా ఆలయ వేదపండితులు చండీహోమం చేశారు. ఈ పూజలో ఆలయ చైర్మన్ జానకీసుధాకర్, ఈవో ఎం.దేవానాథం, ప్రధాన అర్చకులు బుగ్గ లక్ష్మీపతిశర్మ, కందాళ వెంకటాద్రి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.– చిక్కడపల్లి